

వైసీపీకి ఇది చివరి బడ్జెట్..



బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలు కాకుండా వైసీపీ ప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బడ్జెట్ రూపొందించారు. ఏ వర్గానికి న్యాయం చేయని బడ్జెట్ ఇది. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధులు ఇవ్వలేదు. వైసీపీకి ఇది చివరి బడ్జెట్‌గా నిలిచిపోనుంది. ప్రజల అభ్యున్నతి కోసం, వారి జీవన ప్రమాణాల కోసం బడ్జెట్‌లో ఎలాంటి శ్రద్ధ చూపలేదు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమల ఊసే లేదు.

- కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

సాగునీటి ప్రాజెక్టుల విస్మరణ
మాటలకే ధరల స్థిరీకరణ నిధి
విపక్ష నాయకులు, మేధావుల విమర్శ

ఎన్నికల బడ్జెట్

కేటాయింపులపై అస్పష్టత





అనంతపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలన చరమాంకానికి చేరింది. ఇన్నాళ్లూ జిల్లాకు చేసింది ఏమీ లేదు. తుదకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ స్పష్టత ఇవ్వలేదు. దీంతో 'జిల్లా మనవడు' ఇచ్చిన హామీలు అలాగే ఉండిపోయాయి. వైఫల్యాలను దాచుకునే క్రమంలో సీఎం జగన్‌ను స్తుతిస్తూ, కొత్త కొత్త సూక్తులు చెబుతూ.. ఆర్థిక మంత్రి బుగ్గన బుధవారం అసెంబ్లీలో ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చారు. రాష్ట్రాన్ని సామర్థ్యాంధ్ర, భూభద్రతాంధ్ర, మహిళా మహారాణాంధ్ర, సంపన్నాంధ్ర, అన్నాపూర్ణాంధ్ర, సంక్షేమాంధ్ర, సుపరిపాలనాంధ్రగా తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. దీనిపై విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. మేధావివర్గాలు సైతం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై పెదవి విరుస్తున్నాయి.

మాట తప్పారు..

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాకు నిధుల కేటాయింపులో స్పష్టత లేదు. పెండింగ్ ప్రాజెక్టుల గురించి ప్రస్తావించలేదు. పరిశ్రమల ఊసే ఎత్తలేదు. జిల్లా ప్రధాన సమస్యలైన హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా పెండింగ్ పనుల పూర్తి, విస్తరణ, సమాంతర కాలువ వంటి అంశాలు హామీలుగానే మిగిలిపోయాయి. మూడేళ్ల క్రితం రాప్తాడు నియోజకవర్గంలో మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. దీంతోపాటు పేరూరు, భైరవానితిప్ప, ఉంతకల్లు ప్రాజెక్టుల సంగతి ఇంక అంతే అని తేలిపోయింది. జిల్లాలో 1,34,889 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి.. 42 వేలు పూర్తి చేశామని అన్నారు. కానీ ఆ మాత్రం కూడా పూర్తి కాలేదన్నది నిష్టుర సత్యం. ఇప్పటి వరకూ జిల్లాలో ఇళ్ల నిర్మాణానికి రూ.1209 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

చిత్తశుద్ధి ఏదీ..?



సంక్షేమ పథకాల గురించి తప్ప అభివృద్ధి గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ప్రతిపక్ష నాయకులు, పత్రికలను విమర్శించడంతోనే సరిపోయింది. జిల్లా అభివృద్ధి, హంద్రీనీవా, లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరు తదితర అంశాల ప్రస్తావనే లేదు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గ్రామ పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన రూ.8,609 కోట్లు నిధులను దారి మళ్లించారు. వాటిని తిరిగి ఇచ్చే అంశాన్ని ప్రస్తావించలేదు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రూ.1,200 కోట్లు బకాయి పడ్డారు. బడ్జెట్‌లో ఊసే లేదు.

- జాఫర్, జిల్లా కార్యదర్శి, సీపీఐ

రైతుకు ఏదీ అండ..?



వైసీపీ అధికారంలోకి వచ్చాక ధరల స్థిరీకరణ కోసం నిధులు కేటాయిస్తోంది. కానీ వాటిని రైతుల కోసం వినియోగించింది లేదు. ప్రతి బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి అంటున్నారు. కానీ ఆపత్కాలంలో వాటిని వినియోగించి.. రైతును ఆదుకున్న దాఖలాలు లేవు. రైతులకు ఉచితంగా, నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. క్షేత్రస్థాయిలో నాలుగు గంటలు కూడా ఇవ్వడం లేదు. జిల్లాలో రెండుమూడు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. బడ్జెట్‌లో ఇన్‌పుట్ సబ్సిడీకి రూ.1977 కోట్లు కేటాయించారు. జిల్లా రైతులకు రూ.251.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి.

మాటలు ఫుల్.. నిధులు నిల్..



మాటలు ఫుల్.. నిధులు నిల్ అన్నట్టుగా బడ్జెట్ ఉంది. హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా [illegible]

- రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

వ్యవసాయాన్ని విస్మరించారు..



బడ్జెట్‌లో వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించారు. కరువు జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు నిధులు కేటాయించలేదు. సాగునీటి ప్రాజెక్టులను విస్మరించారు. ప్రాజెక్టుల నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించలేదు. ఏటా బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి అంటున్నారే తప్ప.. అమలు లేదు. ఇది ఎన్నికల ప్రచార బడ్జెట్.

- రాయల్ మురళి, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఎన్నికల ప్రచార బడ్జెట్...



ఓటాన్ అకౌంట్ బడ్జెట్ వైసీపీ ఎన్నికల ప్రచార బడ్జెట్‌లా ఉంది. కేటాయింపుల్లో స్పష్టత లేదు. ఏ రంగానికి ఏ మేరకు నిధులు కేటాయిస్తున్నారో స్పష్టంగా చెప్పలేదు. కరువు జిల్లాకు మొండిచేయి చూపారు. వ్యవసాయమే జీవనాధారంగా బతికే జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంది. వాటికి నిధులు కేటాయించకపోవడం దారుణం.

- బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

స్వప్రయోజనాలే..



ఎన్నికలలో స్వప్రయోజనాల కోసం వైసీపీ ప్రభుత్వం బడ్జెట్ రూపొందించింది. ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. అన్ని వర్గాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. జిల్లా సాగునీటి ప్రాజెక్టులను విస్మరించారు. వివాదాస్పదమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి మంత్రి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. జనసేన-టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజామోదమైన బడ్జెట్‌ను అమలు చేస్తాం.

- టీసీ వరుణ్, జనసేన జిల్లా అధ్యక్షుడు

అబద్ధాల బడ్జెట్..



వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిండా అబద్ధాలే. రూ.1.80 లక్షల కోట్ల నుంచి రూ.2.86 లక్షల కోట్లకు పెంచినా.. ప్రజల నెత్తిన రూ.7 లక్షల కోట్ల అప్పులను పెట్టారు. రెవెన్యూ ఆదాయం పెరిగినా భారీగా ద్రవ్యలోటు అసమర్థ ఆర్థిక నిర్వహణకు నిదర్శనం. నివేదికలో రూ.30 వేల కోట్ల మూలధనం చూపుతున్నారు. వాస్తవంలో మూలధన వ్యయం, ఆస్తుల కల్పనలేదు. కార్పొరేషన్‌లు సృష్టించి, వాటిపై భారీమొత్తంలో అప్పులు తీసుకువచ్చినా ఆదాయం లేదు. వాటిపై ఇంతవరకు ఆడిట్ నిర్వహించలేదు. అప్పులకు వడ్డీలను కట్టలేని రాష్ట్రంగా మార్చారు.

- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జగన్‌రెడ్డి వ్యక్తిగత బడ్జెట్...



ఇది రాష్ట్ర బడ్జెట్ కాదు.. జగన్‌రెడ్డి వ్యక్తిగత బడ్జెట్. ఎన్నికలే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించారు. రాష్ట్ర ప్రగతిని ఏ మాత్రం పట్టించుకోలేదు. స్పష్టమైన అభివృద్ధి నమూనాను ఆవిష్కరిస్తారని ఆశించిన వారికి బడ్జెట్ నిరుత్సాహపరిచింది. ధరలు మరింత పెరిగి, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పడేలా బడ్జెట్ ఉంది. జిల్లా కరువు, అభివృద్ధి, నిరుద్యోగం, పంటల బీమా తదితర అంశాలను ప్రస్తావించలేదు.

- పెండ్యాల శ్రీలత,
జనసేన రాయలసీమ రీజినల్ ఉమెన్-కో ఆర్డినేటర్

ముగ్గురు కానిస్టేబుళ్ల డిస్మిస్

దొంగ సొత్తును పంచుకున్న ఫలితం
11ఏళ్ల క్రితం జరిగిన ఘటనలో దోషులుగా తేలిన వైనం
సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తూ పోలీస్ శాఖ ఉత్తర్వులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: దొంగలతో సావాసం చేసిన ముగ్గురు పోలీస్ కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచే డిస్మిస్ చేశారు. అనంతపురం టూటౌన్‌లో పని చేస్తూ సీసీఎస్‌కు అటాచ్‌లో ఉన్న కానిస్టేబుల్ ఎస్.ప్రవీణ్‌కుమార్, వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఎస్.ఫరూక్‌బాషా, డీటీసీలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆనంద్ బాబులను సర్వీస్ నుంచి డిస్మిస్ చేశారు. గత నెలలోనే జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

ఏం జరిగిందంటే...

కడప జిల్లా ముద్దనూరు మండలం నల్లబల్లికి చెందిన కె.సాంబయ్యశెట్టి ఓ దొంగ. అతను 2012లో ప్రకాశం జిల్లా గిద్దలూరులో వెళ్తున్న ఓ రైలులో దొంగతనానికి పాల్పడ్డాడు. పెద్ద మొత్తంలో దొంగిలించిన సొత్తు గురించి అప్పటికే తనతో సంబంధాలున్న కానిస్టేబుళ్లు ఫరూక్‌బాషా, ఎస్.ప్రవీణ్ కుమార్, ఆనంద్‌బాబులకు సమాచారమిచ్చాడు. ఈ ముగ్గురూ అప్పట్లో సీసీఎస్‌లో పనిచేసేవారు. వీరు ఆ సొమ్మును పంచుకున్నారు. ఈ విషయం కొంత ఆలస్యంగా గిద్దలూరు పోలీసులకు తెలిసింది. సాంబయ్యశెట్టిని విచారించడంతో ఫలానా కానిస్టేబుళ్లకు డబ్బు ఇచ్చినట్లు పేర్కొన్నాడు. దీంతో ముగ్గురు కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేశారు. అదే క్రమంలో 2012లో సస్పెండ్ చేశారు. ఆ తరువాత 2020లో ఈ ఘటనపై విచారణ చేపట్టారు. విచారణాధికారిగా ఉన్న అప్పటి డీఎస్పీ వారిపై ఉన్న నేరారోపణ రుజువు కాలేదని 10.09.2020లో ఉన్నతాధికారులకు నివేదక ఇచ్చారు. దానిపై సంతృప్తి చెందని ఉన్నతాధికారులు అందుకు వివరణ ఇవ్వాలని 2021 జనవరిలో ఉత్తర్వులు ఇచ్చారు. ఆ వివరణతో సైతం కన్విన్స్ అవలేదంటూ నోట్ పంపారు. ఆ తరువాత ఆ ముగ్గురిలో ఓ కానిస్టేబుల్ దొంగ నుంచి తీసుకున్న డబ్బును విచారణలో ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ క్రమంలో వారిపై సెక్షన్ 411 కింద కేసు నమోదైంది. దీంతో వారిని సర్వీస్ నుంచి డిస్మిస్ చేశారు. అప్పట్లో ఆ ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన కాలాన్ని కూడా నాట్ ఆన్ డ్యూటీ కింద లెక్కించాలని ఆదేశించారు. కాగా దొంగతనం చేసిన సాంబయ్యశెట్టి ఇప్పటికే మృతి చెందడం గమనార్హం.

తొలి ఓటు టీడీపీకే వేస్తాం

మాజీ మంత్రి కాలవతో యువ ఓటర్లు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7: జీవితంలో తొలిసారి ఓటింగులో పాల్గొనబోతున్నామని, టీడీపీ గెలుపులో తాము కూడా భాగస్వాములవుతామని పలువురు విద్యార్థులు ప్రకటించారు. నగరంలోని ఓ కళ్యాణ మండపంలో రాయదుర్గం నియోజకవర్గ విద్యార్థులతో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు బుధవారం ముఖాముఖి నిర్వహించారు. సమకాలీన రాజకీయాలపై తమ అభిప్రాయాలను కాలవతో పంచుకున్నారు. జగన్ రెడ్డి అనే అరాచకశక్తి రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని కాలవ అన్నారు. ప్రజల ఆశలను వమ్ము చేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీని చిత్తుగా ఓడించడానికి యువత నడుంబిగించాలని సూచించారు. నాలుగున్నరేళ్ల జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదని అన్నారు. పరిశ్రమలు రాని కారణంగా కొత్త ఉద్యోగాల కల్పన కలగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికలు చితికిపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతి పథంలో నడిపించేలా ఉండాలని అన్నారు. చంద్రబాబు నాయకత్వాన్ని బలంగా సమర్థించాలని విద్యార్థులను ఆయన కోరారు. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కార్యాచరణ అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమేనని కాలవ అన్నారు.



అనంతపురంలో చదువుకుంటున్న రాయదుర్గం నియోజకవర్గ విద్యార్థులతో మాజీ మంత్రి కాలవ





సుభాష్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న నాయకులు.. సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా నిరసన

జగన్‌ను ఓడించేందుకు సిద్ధం

ఏపీ నిరుద్యోగుల జేఏసీ, ఏఐవైఎఫ్ హెచ్చరిక

అనంతపురం విద్య, ఫిబ్రవరి 7: మెగా డీఎస్సీ అంటూ దగా చేసిన సీఎం జగన్‌ను ఓడించేందుకు 15 లక్షల మంది నిరుద్యోగులు సంసిద్ధం అవుతున్నారని ఏపీ నిరుద్యోగుల జేఏసీ నాయకులు అన్నారు. ఏపీ నిరుద్యోగుల జేఏసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, నిరుద్యోగులు బుధవారం అనంతపురం నగరంలో నిరసన తెలిపారు. క్లాక్ టవర్ నుంచి సుభాష్‌రోడ్డుమీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. 23 వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేయాలని, జీవో 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పవన్ యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోస్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు 23 వేలు పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఇస్తామని జగన్ నమ్మబలికాడన్నారు. సీఎం అయిన తర్వాత ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా నాలుగున్నరేళ్లు నిరుద్యోగుల రక్తం తాగారంటూ మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పదే పదే నోటిఫికేషన్ అని చెబుతూ.. 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శించారు. మెగా డీఎస్సీ కాకుండా దగా డీఎస్సీ వదిలి ఎన్నికలకు వెళితే.. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగులకు అన్యాయం చేస్తే.. సీఎం ఆఫీస్, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణయ్య, మోహన్, ధనుంజయ, శ్రీకాంత్, సకీల్, ఉమామహేష్, మంజు, పవన్, రారాజు, అశోక్, సునీల్ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తూ...

ఎందుకీ నిర్లక్ష్యం

● పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి ● సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7: పంట నష్టపరిహారం ప్రకటించి నెలలు గడుస్తున్నా ఖాతాల్లో సొమ్ము జమ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం వందలాది మంది రైతులతో కలిసి సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదులక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, రైతులు ఆరు వేల కోట్ల రూపాయల పెట్టుబడి నష్టపోయారని అన్నారు. వర్షాలు రాక మూడు లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని తెలిపారు. అధికారులు కేవలం 1,79,815 హెక్టార్లలో పంట నష్టపోయారని, రూ.300 కోట్ల పరిహారం కావాలని అంచనాలు వేశారని, ఇది రైతులను దగా చేయడమేనని అన్నారు. వేరుశనగ సాగుకు ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు వస్తుందని, ప్రభుత్వం రూ.6 వేలు పరిహారంగా నిర్ణయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తప్పుడు లెక్కలవల్ల కొన్ని మండలాల్లో రైతులకు ఎకరాకు రూ.60 నుంచి రూ.200 మాత్రమే పరిహారం ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, రామిరెడ్డి సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముష్కిన్, గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, రైతుసంఘాల నాయకులు

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ రద్దు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 7: ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీలలో ఇద్దరివి రద్దు చేశారు. పెద్దవడుగూరు మండల తహసీల్దార్ నాగభూషణంను నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. కడప కలెక్టరేట్‌లో ఏఓగా పని చేస్తున్న తహసీల్దార్ విజయకుమార్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిద్దరి వయసూ ఉద్యోగ విరమణకు దగ్గర ఉండటంతో బదిలీని రద్దు చేసి, పూర్వపు స్థానాల్లోనే ఉండేలా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇద్దరినీ ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కడప జిల్లా ఓబులవారిపాలెం మండల తహసీల్దార్ పుల్లారెడ్డిని శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజల సంసిద్ధం

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి
యాడికిలో వేలాది మందితో యువచైతన్య ర్యాలీ



ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన గ్రామస్థులు



యువచైతన్య యాత్ర ర్యాలీలో జేసీ ప్రభాకర్‌రెడ్డి

యాడికి, ఫిబ్రవరి 7: వైసీపీ పాలనతో ప్రజలు విసిగి వేసారిపోయారని, జగన్‌ను ఇంటికి పంపడానికి సంసిద్ధంగా ఉన్నారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. యాడికిలో బుధవారం యువచైతన్య ర్యాలీ నిర్వహించారు. 'యువచైతన్య యాత్రలో ఎక్కువగా మహిళలు వారి సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చారు. ఎక్కడా ఒక్క రోడ్డు కూడా వేయలేదని, తాగడానికి నీరు కరువైందని, వీధిలైట్లు వెలగడం లేదని వాపోతున్నారు. ప్రజా సమస్యలను, అభివృద్ధిని పట్టించుకోకుండా సిద్ధం సిద్ధం అంటూ జగన్ ప్రచారం చేసుకుంటున్నారు..' అని ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. యాడికిలో చేనేత కార్మికులు నేసిన పట్టు చీరలకు గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పట్టుచీరల విక్రయాల కోసం ప్రత్యేక హబ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తాడిపత్రి ఎమ్మెల్యే, అనంతపురం ఎంపీ సీట్ల గురించి చంద్రబాబుతో మాట్లాడామని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రెండుసీట్లు ఇవ్వలేమని చంద్రబాబు తమతో అనలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా వైఎస్ షర్మిలను దూషిస్తూ రకరకాల పోస్టులతో వేధిస్తున్నారని, అయినా సీఎం జగన్ స్పందించడం లేదని జేసీ ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సొంత చెల్లెలి పట్ల కూడా ఆయన మానవత్వం చూపడం లేదని మండిపడ్డారు. ర్యాలీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి సందడి చేశారు. యువతలో జోష్ నింపుతూ ముందుకు సాగారు. క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి తన అనుచరగణంతో ర్యాలీని ముందుకు నడిపించారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, తిరంపురం నీలకంఠ, నారాయణస్వామి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, బొట్టు శేఖర్, పోలా రామాంజనేయులు, నాగిరెడ్డి, బాలాంజనేయులు, బయపురెడ్డి, రామచంద్రారెడ్డి, శ్యాంసుందర్‌నాయుడు, నాగమునిరెడ్డి, దేవేంద్ర, రామునాయక్, రవికుమార్‌రెడ్డి, రామాంజనేయులు, సుధాకర్ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

పల్లె ప్రగతి ఇంతేనా

ఐదేళ్లుగా పల్లెరోడ్లకు మోక్షమేదీ?

- ఉమ్మడి జిల్లాలో పూర్తికాని పనులు
- బిల్లులుకాక వదిలేసిన కాంట్రాక్టర్లు
- అధ్వానంగా మారిన పల్లె రహదారులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలు

అనంతపురం సిటీ/మడకశిర/ కుందుర్పి, ఫిబ్రవరి 7: అభివృద్ధి లేకపోవడంతో పల్లె రోడ్లపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. గత ఐదేళ్లుగా కొత్త రోడ్లు వేయలేదు సరికదా పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు సైతం చేయలేదు. దీంతో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఐదేళ్ల కిందట పీఐయూ కింద రూ. 498.28 కోట్ల నిధులతో ఉమ్మడి



ఏడాది కిందట కంకర వేసి వదిలేసిన విడపనకల్లు మండలం ఆర్ కొట్టాల-డొనేకల్లు రోడ్డు

జిల్లాలో 332 తారు రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాయి. అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ రోడ్లకు గ్రహణం పట్టినట్లైంది. ఈ రోడ్ల గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎక్కడిక్కడ పనులు ఆగిపోయాయి. ఎక్కడ చూసిన కంకర వేసి వదిలేసిన రోడ్లు.. మట్టిని తవ్వి వదిలేసిన రోడ్లు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ఓ మహిళా మంత్రి ప్రారంభించిన రోడ్లు కూడా నేటికి పూర్తి కాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అలసత్వానికి తార్కాణంగా నిలుస్తోంది. అధికార లెక్కల ప్రకారం.. ఇప్పటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 332 రోడ్లలో 151 రోడ్లు మాత్రమే పూర్తి కాగా.. ఇప్పటికీ 117 రోడ్ల పనులు ప్రారంభమే కాలేదు.

ఐదేళ్లుగా పల్లె రోడ్లకు కలగని మోక్షం...

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని 332 రోడ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం చెప్పున నిధులతో 2018-19లో ఈ పనులకు రూ. 498.28 కోట్లు కేటాయించారు. ఈ పనులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు కింద చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పనులను ఆశించిన స్థాయిలో చేయకపోగా.. పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించ డంతోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పనులు పూర్తిగా పడకేశాయనే ప్రచారం ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. ప్రధానంగా కళ్యాణదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లో మంజూరైన రోడ్లను పూర్తిగా విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. రూ. 35.26 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల పరిధిలో మంజూరైన రోడ్లలో ఎక్కువ శాతం రోడ్ల పనులు చేయలేదు. మడకశిర నియోజకవర్గంలో మంజూరైన 13 రోడ్లలో ఏ ఒక్కటి కూడా వేయకపోవడం గమనార్హం.

బిల్లుల పెండింగ్ వాస్తవమే...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఐయూ కింద జరిగిన పనుల బిల్లుల పెండింగ్ ఉన్న విషయం విస్తవమే. కాంట్రాక్టర్లు పని చేయడానికి ముందుకురావడం లేదు. కొన్ని ప్రాంతాలలో వేగంగా జరుగుతున్నాయి. బిల్లులు విషయం ప్రభుత్వానికి నివేదించాం. కొన్ని చోట్ల ఇతర నిధుల కింద రోడ్ల పనులు చేయడంతో సంబంధిత రోడ్ల పనులను రద్దు చేశాం. త్వరగా పనులు చేసే విధంగా చూస్తాం.

- వై. భాగ్యరాజ్, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ



2020లో కుందుర్పి మండలం అపిలేపల్లి-మండలపల్లి రోడ్డు పనుల శిలాఫలకం



రెండేళ్ల కిందట ఆగిపోయిన గుత్తి మండలంలోని తొండపాడు-గొందిపల్లి రోడ్డు నిర్మాణం

మంత్రి ఇలాఖాలోనే దారుణం...

కళ్యాణదుర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టిన ఉష శ్రీచరణ్ నియోజకవర్గంలో కూడా రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీ రాజ్‌శాఖ పీఐయూ కింద కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఐదేళ్ల కిందట 29 తారు రోడ్లను మంజూరు చేయగా.. ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. కొన్ని ప్రాంతాలలో కొందరు కాంట్రాక్టర్లు రోడ్లు వేస్తుండగా.. బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. మంత్రి 2020లో ప్రారంభించిన కుందుర్పి మండలం కరిగానపల్లి నుంచి అపిలేపల్లికి వెళ్లే రహదారి పనులు పూర్తి కాలేదు. ఇప్పటికి ఈ రోడ్లు కంకర తేలి దర్శనమిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా మంత్రి ఇలాఖాలోనే రోడ్ల పరిస్థితి పూర్తి దయనీయ స్థితిలో ఉండటం విమర్శలకు తావిస్తోంది. కాగా.. కళ్యాణదుర్గంలో అభివృద్ధి చేయలేని మంత్రి పెనుకొండను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీలు గుప్పిస్తూ 2024 ఎన్నికలకు ప్రచారం చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది.

కుందుర్పిలో కంకరదారులు..

కుందుర్పి మండలంలోని అపిలేపల్లి నుంచి మండలపల్లి వరకు, బండమీదపల్లి నుంచి తమ్మయ్యదొడ్డి, అక్కడి నుంచి శ్రీమజ్జనపల్లి వరకు తారు వేస్తామని ప్రకటించి.. పనులు మొదలు పెట్టారు. దారిని తవ్వి.. కంకర వేసి వదిలేశారు. గతంలో మట్టి రోడ్డే బాగుండేదని, నడిచి వెళ్లినా, ద్విచక్ర వాహనాల్లో వెళ్లినా ఇబ్బందులు ఉండేవి కాదని ఆ గ్రామాల ప్రజలు అంటున్నారు. కంకర దారిలో నడవలేక, వాహనాల్లో వెళ్లలేక నరక యాతన పడుతున్నామని వాపోతున్నారు. మండలంలోని గ్రామీణ రహదారులను బీటీ రోడ్లుగా మార్చే పనిని 2020 జనవరి ఒకటో తేదీన పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రారంభించారు. అపిలేపల్లి-మండలపల్లి రోడ్డుకు రూ.1.89 కోట్లు, అపిలేపల్లి-మండలపల్లి-బండమీదపల్లి రోడ్డుకు రూ.4.20 కోట్లు కేటాయించారు. ఈ పనులను కొంతమేరకు చేశారు. కానీ బిల్లులు మంజూరు కానందున అర్థంతరంగా వదిలేశారు. ఇవేకాదు, మండలవ్యాప్తంగా రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఎనుములదొడ్డి నుంచి తెనగల్లు, తెనగల్లు నుంచి అపిలేపల్లి వరకు దాదాపు 15 కి.మీ. దారి కంకర తేలింది. దీంతో ఆ రోడ్డు మీదుగా మండల కేంద్రానికి వెళ్లే వారు మరో మార్గంలో 20 కి.మీ. చుట్టేసుకుని వెళుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు సైతం ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది.

● ఉమ్మడి జిల్లాలో జిల్లాల వారిగా పరిస్థితి ఇలా...

● అనంతపురం జిల్లాలో...
నిధుల కేటాయింపు : రూ. 268 కోట్లు
మంజూరైన రోడ్లు : 138
పూర్తయిన రోడ్లు : 32
పనులు జరుగుతున్న రోడ్ల సంఖ్య : 38
రద్దయిన రోడ్లు : 03
పనులు ప్రారంభంకానీ రోడ్ల సంఖ్య : 65
పెండింగ్ బిల్లులు : రూ. 10.20 కోట్లు

● శ్రీ సత్యసాయి జిల్లాలో ...
నిధుల కేటాయింపు : రూ. 230.28 కోట్లు
మంజూరైన రోడ్లు : 194
పూర్తయిన రోడ్లు : 119
పనులు జరుగుతున్న రోడ్ల సంఖ్య : 21
రద్దయిన రోడ్లు : 02
పనులు ప్రారంభంకానీ రోడ్ల సంఖ్య: 52
పెండింగ్ బిల్లులు : రూ. 25.06 కోట్లు



కంకర వేసి వదిలేసిన కరిగానపల్లి-అపిలేపల్లి రోడ్డు



కంకర తేలిన తమ్మయ్యదొడ్డి రోడ్డు

మడకశిర నియోజకవర్గంలో అధ్వానం..

గత ప్రభుత్వం మడకశిర నియోజకవర్గం ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్ల అభివృద్ధికి దాదాపు రూ.వంద కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. ఇందులో మడకశిర ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.60 కోట్లు, నియోజకవర్గం పరిధిలో ఆరు రోడ్లకు రూ. 50 కోట్లు, కిరికెర మోర్‌బాగల్ వయా హేమావతి రోడ్డుకు రూ.20 కోట్లు కేటాయించారు. టెండర్లు పూర్తయ్యి పనులు ప్రారంభించారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో 25శాతంలోపు పనులు జరిగాయని వీటిని రద్దు చేశారు.

టీడీపీ హయాంలో చేసిన పనులే..


గత ప్రభుత్వం లో జరిగిన పనులే తప్ప ఈ మధ్య కాలంలో రోడ్ల విస్తరణకు సంబంధించి పనులు జరగలేదు. పంచాయితీ రాజ్ శాఖనుంచి ఆర్అండ్‌బీ పరిధిలోకి 258 కిలోమీటర్ల రోడ్లను బదలాయించారు. అందులో మడకశిర మండలంలో 70 కిలో మీటర్లు, అగళి మండలంలో 60 కిలోమీటర్లు, రొళ్ల మండలంలో 50 కిలోమీర్లు, గుడిబండ మండలంలో 40 కిలో మీటర్లు, అమరాపురం మండలంలో 38 కిలోమీటర్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్నప్పుడు మెటల్ వేసి మట్టిని వేశారు. దీంతో ఆరోడ్లను అభివృద్ధి చేసేందుకు ఆర్అండ్‌బీ పరిధిలోకి తీసుకున్నారు. నేటికీ ఆ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆరోడ్లు వర్షాలకు దెబ్బతిని గుంతలమయం అయ్యాయి.

మరణించినా.. ఓటర్లే..!

చనిపోయినా తుది ఓటరు జాబితాల్లో పేర్లు

తప్పుల తడకగా తుది ఓటరు జాబితా

గార్లదిన్నె, ఫిబ్రవరి 7: చనిపోయిన వారికి సైతం ఓటు హక్కు కల్పించిన ఘనత మండల అధికారులకు దక్కుతోంది. ఇటీవల విడుదల చేసిన తుది ఓటరు జాబితానే ఆవిషయాన్ని స్పష్టం చేస్తోంది. తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయడంలో అధికార యంత్రాంగం, బీఎల్ఓల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మండల వ్యాప్తంగా సుమారు 45291 మంది ఓటర్లు ఉన్నాయి. ఈసారి దాదాపు 5వేల మందికి పైగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో వివిధ గ్రామాల్లో చనిపోయిన వారితోపాటు డబుల్ ఎంట్రీ ఓట్లు, ఫొటో ఒకరిది అడ్రస్ మరొకరిది లాంటివి కూడా ఉన్నాయి. గార్లదిన్నెలో 49వ కేంద్రంలో సుమారు 10 మంది వరకు చనిపోయిన వారి ఓట్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. కేశవాపురం గ్రామంలో ఒకే వ్యక్తి ఫొటో డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయి.





మరణించినా జాబితాలో ఓటు



కేశవాపురంలో డబుల్ ఎంట్రీ

యాదవ కమ్యూనిటీ ఓట్లు ప్రత్యక్షం





వడ్రవన్నూరులో యాదవ కమ్యూనిటీ రెండు ఓట్లు

రాయదుర్గం: మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో యాదవ కులస్థుల ఓట్లు ప్రత్యక్షమైనట్లు టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో దళిత, కురుబ, వాల్మీకి కులస్థులు మాత్రమే జీవిస్తున్నారు. కానీ యాదవ కమ్యూనిటీకి చెందిన గొల్ల సంతోష్‌కుమార్ సన్నాఫ్ గొల్ల గంగాధర, గొల్ల యశోదమ్మ వైఫ్ ఆఫ్ గొల్ల మల్లేష్ అనే వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలోకి ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. బీఎల్ఓలు, వైసీపీ నాయకులు కలిసి దొంగ ఓట్లను చేర్చారనడానికి ఇదే నిదర్శనమన్నారు.

ప్రాణాలు తీసిన నిద్రమత్తు

కంటైనర్ బోల్తా.. ఇద్దరు కూలీలు, 40 ఆవులు మృతి



బోల్తా పడ్డ కంటైనర్



శ్రీనివాసులు, ఈశ్వరరావు మృతదేహాలు

తాడిపత్రి, ఫిబ్రవరి 7: పెద్దవడుగూరు మండల పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద పశువులను తరలిస్తున్న కంటైనర్ బోల్తా పడటంతో ఇద్దరు కూలీలు మృతిచెందారు. కంటైనర్‌లో ఉన్న సుమారు 40 ఆవులు మృతిచెందాయి. మరో పది ఆవులు, పది ఎద్దులు గాయపడ్డాయి. బెంగళూరు - హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం నుంచి కంటైనర్‌లో 60కిపైగా ఆవులు, ఎద్దులను అక్రమంగా బెంగళూరు వైపు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కంటైనర్ అదుపుతప్పి.. రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టి బోల్తా పడిందని వారు తెలిపారు. మృతులను విశాఖపట్నం జిల్లా దేవవరం గ్రామానికి చెందిన ఈశ్వరరావు (45), శ్రీకాకుళం జిల్లా పంగవానిపేట గ్రామానికి చెందిన శ్రీనివాసులు(46)గా గుర్తించారు. వీరిద్దరూ పశువులతోపాటు కంటైనర్‌లో ఉండటంతో వాటి కిందపడి మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌తోపాటు క్యాబిన్‌లో ఉన్న ముగ్గురు పారిపోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కంటైనర్‌లో ఇరుక్కుపోయి, గాయపడ్డ ఆవులు, ఎద్దులను బయటకు తీయించారు. గుత్తి పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. మృతిచెందిన ఆవులు, ఎద్దులకు గుత్తి పశువైద్యశాలలో పోస్టుమార్టం చేయించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే బీజేపీ జిల్లా నాయకులు ప్రమాద స్థలానికి వెళ్లారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తుత్తి డీఎస్సీ

ఉమ్మడి జిల్లాలో 386 ఖాళీలు... ఎస్‌జీటీ పోస్టులు 107 మాత్రమే..

ఉసూరుమనిపించిన వైసీపీ ప్రభుత్వం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 7: అనుకున్నట్లే జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది. నాలుగున్నరేళ్లకుగాపై ఊరించి.. ఎన్నికల ముందు కేవలం 386 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పూనుకుంది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఏనాడూ లేని విధంగా ఎస్‌జీటీ పోస్టులను భారీగా తగ్గించింది. ఒకేసారి టెట్, డీఎస్సీ నిర్వహిస్తుండటం, దరఖాస్తులు, పరీక్ష, ఫలితాలకు ఎలాంటి వ్యవధి ఇవ్వకుండా హడావుడి చేయడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల మందికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం 400 పోస్టులు కూడా భర్తీ చేయకపోవడంపై నిరుద్యోగులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

386 పోస్టులే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 386 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నారు. ఇందులో సెకెండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్ 164, టీజీటీ పోస్టులు 115 ఉన్నాయి. ఎస్‌జీటీ పోస్టులు పెద్ద ఎత్తున ప్రకటించేవారు. జిల్లాలో 195 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత అన్ని జిల్లాల నుంచి విద్యాశాఖాధికారులను కమిషనరేట్‌కు పిలిపించి, ఖాళీలపై కసరత్తు చేశారు. ఈ క్రమంలో జిల్లాలో ఖాళీలను 386కు పెంచారని తెలిసింది.

సమయం లేదు..

టెట్‌కు ఈ నెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలౌతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 23 నుంచి అభ్యర్థులకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయి. 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకూ టెట్ నిర్వహిస్తారు. మార్చి 14న ఫలితాలు ప్రకటిస్తారు. టెట్ క్వాలిఫై అయిన వాళ్లను డీఎస్సీకి అర్హులుగా ప్రకటిస్తారు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకూ రెండు విడతల్లో డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇలా.. మార్చి 14న టెట్ ఫలితాలు ప్రకటించి.. ఆ మరుసటి రోజే డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం ఏమిటని ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెట్ క్వాలిఫై అవుతారో లేదే తెలియకనే.. డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలన్నదే జగన్ ప్రభుత్వం వ్యూహం. దరఖాస్తుల రూపంలో కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని నిరుద్యోగులు మండిపడ్డారు.

ఎన్నికల కోసమే..



ఎన్నికల తరుణంలో జగన్ ప్రభుత్వం జిమ్మిక్కులు చేస్తోంది. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. టీచర్ కావాలనుకున్నవారు జగన్ ప్రభుత్వంలో కూలి పనులు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. కేవలం 6100 పోస్టులిస్తే లక్షలాది మంది నిరుద్యోగులు ఏం కావాలి..?

- లక్ష్మీనరసింహ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు

నిరుద్యోగులకు అన్యాయం..



నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాం. అదిగో.. ఇదిగో అంటూ టైం వేస్ట్ చేశారు. ఇప్పుడు హడావుడిగా టెట్, డీఎస్సీ ఒకేసారి విడుదల చేస్తున్నారు. జిల్లాలో మరీ తక్కువ పోస్టులిచ్చారు. డీఎస్సీ నోటిఫికేషన్ చూశాక నిరాశ కలుగుతోంది.

- మన్నల అనిత, డీఎస్సీ అభ్యర్థి

సీఎం ఆఫీస్ ముట్టడిస్తాం..



చదువు విలువ తెలియని వారిని పాలకులుగా ఎన్నుకున్నందుకు నిరుద్యోగులకు బాగా బుద్ధి చెప్పారు. మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను సీఎం జగన్ దగా చేశారు. మునుపెన్నడూ లేని విధంగా అతి తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్, టెట్, డీఎస్సీ షెడ్యూల్ అంతా బూటకం. 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇవ్వాలి. లేకుంటే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను, సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

- కుల్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

23 వేల పోస్టులు భర్తీ చేయాలి



డీఎస్సీ కోసం కొన్నేళ్ల నుంచి సిద్ధమవుతున్నాం. వేల రూపాయలు ఖర్చు చేశాం. అధికారంలోకి రాగానే 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పుడు 6,100 పోస్టులు ఇస్తున్నారు. ఇది అన్యాయం. మా భవిష్యత్తుకు శరాఘాతమే. వెంటనే 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలి.

- కోమల, డీఎస్సీ అభ్యర్థి

చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించండి

ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలిచ్చారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జిల్లాలోని ఎస్ఐ, ఆపై స్థాయి పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ (యుఐ) కేసులు తగ్గించాలన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో జరిగిన నేరాలను సమీక్షించి ఆయా ప్రాంతాల్లో ఈసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని అందరు పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర చరిత్ర కలిగిన వారు, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు, గుర్తుతెలియని మృత దేహాల కేసులకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు త్వరగా ముగించి కోర్టుల్లో నంబర్లు తీసుకోవాలని సూచించారు. చీటింగ్ కేసులు, దొంగతనాల కేసుల ఛేదింపునకు కృషి చేయాలన్నారు. గంజాయి తరలింపుపై నిఘా ఉంచి, ఎక్కడా విక్రయాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగులకు తావుండకూడదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, డీఎస్పీలు శ్రీనివాసులు, సీఎం గంగయ్య, శివభాస్కర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, మునిరాజా, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

ఎక్కడా రాజీపడకండి

ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలి

విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

ఎన్నికల అధికారులకు శిక్షణలో కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 7: ఎన్నికల నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా నిబంధనల మేరకు ముందుకుసాగాలని అధికారులకు కలెక్టరు గౌతమి సూచించారు. బుధవారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఎన్నికలపై సెక్టోరియల్ అధికారులు, పోలీసు అధికారులతో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్రే కీలకమని, ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన వసతులు ఉండేలా చూడాలన్నారు. ఫర్నిచర్, తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు ఉండేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్‌కేంద్రం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండేలా చూడాలని సూచించారు. ఏ పోలింగ్‌కేంద్రాలలో ఓటువేయాలో ఓటర్లకు ముందే తెలపాలన్నారు. మూడుసార్లు పోలింగ్‌కేంద్రాలను తనిఖీ చేయాలని, ఆ రిపోర్టులను పెట్టాలన్నారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్‌రోజు ఎలా ఉండాలో వాటిగురించి అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలలో ఓటింగ్ వేసేవిధానంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. పోలింగ్‌శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికి అప్పగించిన బాధ్యతను వారు చిత్తశుద్ధితో చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల నిఘా పెంచాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎక్కడా చిన్నసమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓలు, జడ్పీసీఈఓ, నగరపాలక కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

వచ్చే వారంలో టిడ్కో ఇళ్ల ప్రారంభం



పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 7: తాడిపత్రిలోని 1,024 టిడ్కో ఇళ్లను వచ్చేవారంలో (11, 12 తేదీల్లో) ప్రారంభిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ బొమ్మన ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. అనంతపురం నగర శివారుతోపాటు తాడిపత్రిలోని గన్నేవారిపల్లి సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. విడతల వారీగా టిడ్కో ఇళ్లను ప్రారంభిస్తున్నామన్నారు. మొదట తాడిపత్రి, ఆ తర్వాత అనంతపురం, ధర్మవరంలో టిడ్కో ఇళ్లను ప్రారంభిస్తామని అన్నారు. ఆయన వెంట టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఈఈ మల్లికార్జునప్ప, డీఈలు సాలన్న, షభాన, సిబ్బంది, కాంట్రాక్టర్లు ఉన్నారు.

10న సుప్రీంకోర్టు జడ్జి అనంతకు రాక

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 7: సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఆశానుద్దీన్ ఈనెల 10వతేదీన అనంతపురానికి వస్తున్నారని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జేఎన్‌టీయులోని ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో బార్‌కౌన్సిల్‌ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే వర్క్‌షాప్‌నకు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఆశానుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ఆయనతోపాటు పలువురు హైకోర్టు జడ్జిలు వస్తున్నారని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సిద్ధం సభ వాయిదా

18న నిర్వహణ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: జిల్లాలోని రాప్తాడు సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభను ఈనెల 18వతేదీకి వాయిదా వేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు సంబంధించి రాప్తాడులో ఈనెల 11న సభ నిర్వహించాలనుకున్నామని, అనివార్య కారణాలతో సభ వాయిదా వేశామన్నారు. షర్మిలకు భద్రత వారు సొంతంగా పెట్టుకోవాలని, ఆమెకు భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలైతే భద్రత ఇస్తారా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చినప్పుడు తమకు భద్రత తీసేశారన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

శింగనమల, ఫిబ్రవరి 7: రైతుల సమస్యలపై గురువారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యాక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ కోరారు. బుధవారం స్థానిక రామస్వామి దేవాలయంలో శింగనమల గ్రామ సీపీఐ అధ్యక్షుడు నేసే మధు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పంట నష్టపరిహారం ఇవ్వాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, మధుయాదవ్, బయన్న, వాసు, చితంబదప్ప దస్తగిరి పాల్గొన్నారు.

నార్పల : జిల్లా రైతులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్, ఏపీ రైతు సంఘం నార్పల మండల కార్యదర్శి లలితమ్మ, మండల అధ్యక్షుడు జోసెఫ్ కోరారు. స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో సీపీఐ, రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాములరాయిలో వైసీపీ ఖాళీ..

మాజీ మంత్రి పరిటాల సునీత




తమ వర్గీయులతో పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన పాములరాయి ఎంపీటీసీ లక్ష్మీదేవి, రాచానపల్లి మాజీ ఎంపీటీసీ గువ్వల రమణారెడ్డి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని పాములరాయి గ్రామంలో నాలుగైదు కుటుంబాలు మినహా దాదాపు వైసీపీ ఖాళీ అయిందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాములరాయి గ్రామంలో సాయిమహేశ్వర డిగ్రీ కళాశాల చైర్మన్ మునిరత్నం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీటీసీ కే.లక్ష్మీదేవి విశ్వనాథ్‌తో పాటు వైస్ సర్పంచు రజిని, వెంకటరమణ, స్టోర్ డీలర్ శ్రీనివాసులు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పెద్దన్నతో పాటు 65 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పరిటాల సునీత మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఈ గ్రామంలో తనకు ఓట్లు తగ్గాయని.. ఈసారి డబుల్ మెజార్టీ రావాలన్నారు. రాప్తాడులో తాను, ధర్మవరంలో శ్రీరామ్ ఎమ్మెల్యే అవుతారని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని అన్నారు.

పాపంపేట, రాచానపల్లిలో..: అనంతపురంలోని పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మండలంలోని పాపంపేట, రాచానపల్లికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాచానపల్లి మాజీ ఎంపీటీసీ గువ్వల రమణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పాపంపేటకు చెందిన ముత్యాలరెడ్డి, విజయమ్మ, మధుసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జేసీబీ శంకర్, వినోద్, మధు, పెద్దక్క, చిన్నక్క తదితర 20 కుటుంబాలు పార్టీలోకి చేరాయి.

రైతులను నిరాశపరిచిన బడ్జెట్

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ రైతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్ట పరిహారం ప్రస్తావనే తేకపోగా.. రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేవని చెప్పడం ఈ దుర్మార్గపు ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. వర్షాల్లేక పంటలు పొలాల్లోనే ఎండిపోతే జిల్లాలో 31 మండలాలకు గాను 28 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రధానంగా హెచ్ఎల్‌సీ ఆధునీకరణ, హంద్రీనీవా వెడల్పు, జీడిపల్లి నుంచి చేపట్టిన భైరవానితిప్ప, ఉంతకల్లు జలాశయ నిర్మాణాలు తదితర పథకాలకు నామమాత్రంగా మాత్రమే నిధులు కేటాయించడం, ఆ కేటాయించిన డబ్బులు కూడా జీతభత్యాలకే సరిపోని పరిస్థితి ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణాలు కూడా సాధ్యంకాని పరిస్థితి చూస్తుంటే కరువు రైతాంగం పట్ల వైసీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. గత ఖరీఫ్, రబీ పంటల్లో నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7: అనంతపురం అర్బన్‌పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో నగర పాలక సంస్థ పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. బుధవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టీ డీపీ నాయకులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, ముక్తియార్ మాట్లాడారు. వేసవికి ముందే అర్బన్ పరిధిలోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. నగర కార్పొరేటర్లు ప్రజలకు తాగునీరు అందించడంలో ఘోరంగా వైఫల్యం చెందుతున్నారన్నారు. టీడీపీ హయాంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ నాయుడు, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు కలిసిన నీరు తాగి 20 గొర్రెల మృతి

రామగిరి, ఫిబ్రవరి 7: మండలంలోని ఎంసీపల్లికి చెందిన బోయకిష్టప్ప, బోయనారాయణకు చెందిన 40 గొర్రెలు క్రిమిసంహారిక నీటిని తాగి 20కి పైగా గొర్రెలు మరణించాయి. బుధవారం ఎంసీపల్లి గ్రామ సమీపంలోగల పొలానికి క్రిమిసంహారిక మందుకలిపిన నీటిని తాగడంతో 19 గొర్రెలు, రెండు మేకలు మృతిచెందాయి. మిగిలినవి కూడా అస్వస్థకు గురయ్యాయి. రామగిరి పశువైద్యాధికారి మౌలాలికి సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి అస్వస్థకు గురైన వాటికి వైద్యసేవలు అందించారు. మరణించిన వాటికి పోస్టుమార్టం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దాదాపు రూ.2.50లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రామగిరి ఎంపీపీ నాగమ్మ, సర్పంచ్‌లు నాగరాజు, చింతన్న బాధితున్ని పరామర్శించారు.

సర్పంచుల సమస్యలపై మరింత ఉద్యమిస్తాం: దేగల

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7: సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం మరింతగా ఉద్యమిస్తామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి ప్రకటనలో స్పష్టం చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేసిన సర్పంచులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాలకు అందరూ సహకరించి హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.

రోడ్డు నియమాలపై అవగాహన

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ అనంతపురం డిపో ఆధ్వర్యంలో నగరంలోని 15వ వార్డులో నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రోడ్డునియమాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ అనంతపురం డీఎం నాగభూపాల్, అసిస్టెంట్ డిపోమేనేజర్ వినయ్,బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి పాల్గొన్నారు.

మాటతప్పిన జగన్‌రెడ్డి

శింగనమల, ఫిబ్రవరి 7 : ఏటా 25 వేలు పోస్టులతో మోగా డీఎస్సీ విడుదల చేస్తానని చెప్పిన జగన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఆ మాటతప్పి యువతను మోసం చేశాడని జనసేన మండల అధ్యక్షుడు తోట ఓబిలేసు బుధవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఇప్పుడు ఎన్నికల సమీపిస్తుడటంతో కేవలం 6100 పోస్టుల భర్తీకి మాత్రమే జగన్ నోటిఫికేషన్ విడుదల చేశారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు యువత ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మేడపై నుంచి పడి యువకుడి మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: స్థానిక మూడో రోడ్డుకు చెందిన అనిల్ (32) మేడపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి బుధవారం మరణించాడు. అతనికి మూర్ఛవ్యాధి ఉంది. ఈ క్రమంలో బుధవారం అనంతపురం రూరల్ మండలం నారాయణపురం వెళ్లాడు. అక్కడ రాత్రి 7 గంటల సమయంలో ఓ ఇంటిపై నుంచి కిందపడి మరణించాడు. మూర్ఛవ్యాధితోనే కిందపడి మరణించినట్లు భావిస్తున్నారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వెంకటయ్య

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 7: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వెంకటయ్యను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. శింగనమల నియోజకవర్గం యలుట్ల గ్రామానికి చెందిన వెంకటయ్య.. పార్టీలో పలు పదవుల్లో పనిచేశారు.

నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయాలి

రాప్తాడు : పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రత్నబాయి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వైద్య సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యాధికారి శివకృష్ణ, ఎంఈఓ మల్లికార్జున పాల్గొన్నారు.

మిక్చర్ తయారీ కేంద్రం తనిఖీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 7: నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న మిక్చర్ తయారీ కేంద్రాన్ని ఫుడ్ సేఫ్టీ అడ్వైజర్ గుజ్జల లక్ష్మణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఆహార విషయంలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని వారికి సూచించారు.

బెస్తలను మోసం చేసిన వైసీపీ

శింగనమల, ఫిబ్రవరి 7: వైసీపీ ప్రభుత్వం బెస్తలను నిలువునా మోసం చేసిదని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు చేపలహరి, బెస్తహరి, బెస్త క్రిష్ణామూర్తి మండిపడ్డారు. బుధవారం స్థానిక సాయిబాబా గుడి వద్ద మండల బెస్త సాధికార కమిటీ నాయకుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో బెస్తలకు టీడీపీ చేపట్టిన కార్యాక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం బెస్తలకు చేసిన అన్యాయాలను విరించారు. కార్యక్రమంలో బెస్తనారాయణస్వామి, చిన్న ఆంజినేయులు, వెంకటేష్, శంకర్, పాపన్న ఓబిలేసు, ప్రసాద్, లక్ష్మణరావు, విజయ్ సురేష్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బెస్త సంఘం నాయకులు

బడుగులకు అండ.. పరిటాల

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: పరిటాల కుటుంబం బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి.. అనేక మందిని ఉన్నత స్థాయికి చేర్చిందని టీడీపీ మండల నాయకులు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. తోపుదుర్తి కుటుంబం బడుగు బలహీన వర్గాల ప్రజలను అణగదొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చమన్ సాబ్ మృతికి కారణం పరిటాల కుటుంబమే అని ఎన్నికల ముందు తప్పుడు ప్రచారం చేసిన ఆ తోపు సోదరులు.. అధికారం లోకి రాగానే దాని గురించి మాట్లాడటం లేదని, దమ్ముంటే విచారణ జరిపించి రుజువు చేయాలని సవాల్ విసిరారు. అనేక మంది బీసీలను ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా చేసిన ఘనత పరిటాల కుటుంబానికే దక్కుతుందన్నారు. తోపు సోదరులు చైర్మన్ బోయ గిరిజమ్మతో రూ. ఆరుకోట్లు వసూలు చేశారని.. ఆత్మకూరు ఎంపీపీగా హేమలతను చేసినందుకు రూ. 50 లక్షలు తీసుకున్నా రని.. ఆలమూరు సుబ్బారెడ్డిని అడ్డుపెట్టుకొని బోయ కులస్థులను బెదిరించి 100 ఎకరాలు దౌర్జన్యంగా తీసుకున్నారని ఆరోపించారు. తోపుదుర్తి చెరువులో 40 ఎకరాలు తోపుదుర్తి అన్నదమ్ములు పేరు మీద 1బి చేసుకున్నారని, బెంగుళూరు వాళ్లను బెదిరించి మామిళ్లపల్లి దగ్గర 80 ఎకరాలు లాక్కున్నారని, పాల డెయిరీ పేరుతో రూ. కోట్లు దోచుకున్నారని, గ్రామాల్లో పాలసేకరణ చేసి వారికి బిల్లులు ఇవ్వకుండా రూ. లక్షలు దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. రూ. 805 కోట్లతో పరిటాల రవీంద్ర కాలువకు నిధులు మంజూరు చేయిస్తే.. దాన్ని పూర్తి చేకుండా ఎందుకు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజి కన్వీనర్ మనోరంజన్, మండల నాయకులు కందుల ఓబులపతి, వెంకటేసులు, పూల ఓబులపతి, రామదాసు, అక్కులప్ప, నరసింహులు, బొమ్మయ్య, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, హనుమంతు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాష్ట్రాన్ని వైసీపీ నుంచి కాపాడుకుందాం

టీడీపీ శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి

నార్పల, ఫిబ్రవరి 7: ఎన్నికల్లో వైసీపీని ఓడించి... రాష్ట్రాన్ని కాడుకుందామని శింగనమల నియోజకవర్గం టీడీపీ నాయకురాలు బండారు శ్రావణి పేర్కొ న్నారు. చంద్రబాబు సారథ్యంలోనే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. మండలంలోని గడ్డంనా గేపల్లి గ్రామంలో బుధవారం ఆమె స్థానిక నా యకులతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ పథకాల కరపత్రా లను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో జీసీ బాబు, గుత్తా వెంకటనా యుడు, వెంకటేశు, సర్పంచు నాగన్న, బండిచంద్రమోహన్, కేశేపల్లి లక్ష్మీనారాయణ, సిద్దరాచర్ల నరసింహు లు, కృష్ణ, గొల్లపల్లి మల్లికార్జున పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బండారు శ్రావణి

ఇది ఎన్నికల జిమ్మిక్కు బడ్జెట్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 7: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్.. కేవలం రానున్న ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే అన్నట్లుందని మేధావులు విమర్శిస్తున్నారు. ఈ బడ్జెట్ ఏ వర్గ ప్రజలనూ ఆకట్టుకోలేదని, ఈ బడ్జెట్ అంతా రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారని మండిపడుతున్నారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే...

ఓట్లు కొల్లగొట్టేందుకే..



జిల్లాలను విభజించి పాలనా వికేంద్రీకరణ చేశామంటున్న సీఎం జగన్.. నేటి వరకు ఉమ్మడి జిల్లాల కేంద్రంగానే పాలనకొనసాగుతోంది. రాష్ట్రపతి గెజిట్‌నోట్ వస్తేనే జిల్లా వికేంద్రీకరణ సాధ్యమని తెలిసినా ప్రజలను మభ్యపెడుతూ నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణాలంటూ అబద్ధాలు చెబుతు న్నారు. ప్రతి జిల్లాలో దిశా పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేసి భద్రతా మౌలిక సదుపాయాలు పెంచామంటున్నారు. మహి ళలపై వేధింపులు, అత్యాచారాలు, దాడులు ఎందుకు పెరుగు తున్నాయి? దిశా చట్టం ద్వారా ముద్దాయిలను ఎందుకు శిక్షించ డంలేదు? ఇదంతా బహుజనులను మభ్యపెట్టి ఓట్లను కొల్లగొట్టేందుకు చేస్తున్న కుట్రలు.

- బానాసి నారాయణప్ప, బహుజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు

అబద్ధపు నివేదికల బడ్జెట్



విద్యాదీవెనకు రూ.11,901 కోట్లు, వసతి దీవెనకు రూ.4,276 కోట్లు వెచ్చించామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఫీజులు చెల్లించడంలేదని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు పరీక్షలు ఎందుకు నిర్వ హించడంలేదో వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలికదా?. అదేవిధంగా డిగ్రీలు పూర్తిచేసిన 80 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాల్లేకుండా ఎందుకున్నట్లు?. నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్, పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో ఒక స్కిల్ కాలేజ్‌లు ఎక్కడున్నాయో ప్రజలకు తెలియజేయాలి. ఎన్నికలవేళ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేలా అబద్ధపు నివేదికల బడ్జెట్‌ను రూపొందించారు.

-వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

ఉత్పాదక శక్తిని పెంచాలి



అంతర్గత ఆదాయ వనరులు పెంపొందించి ఉత్పాదక శక్తిని పెంచాలి. వాటితో పాటు ఖర్చులు తగ్గించినప్పుడే ఆదాయం పెరిగి ద్రవ్య లోటు క్షీణిస్తుంది. ఏ ప్రభుత్వమైనా మూలధన వ్యయాలను సరైన మార్గంలో వెచ్చించాలి. పరిశ్రమలు నెలకొల్పడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంపై ఎక్కువగా దృష్టిసారించాలి.

- ప్రొఫెసర్ ఆంజనేయులు, కామర్స్ విభాగాధిపతి, ఎస్కేయూ

ద్రవ్యలోటు ఆందోళనకరం



రాష్ట్ర ద్రవ్య లోటు ఆందోళనకరంగా ఉంది. తాత్కాలిక బడ్జెట్ కావడంతో దీనిని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరంలేదు. ఎన్నికల అనంతరం ఏర్పడే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడు ఏఏ రంగానికి ఎంత మొత్తాలు కేటాయిస్తారో దాని మీద ఆధారపడి ఉంటుంది. ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కావడంతో ఈ మూడు నెలలు మాత్రమే దృష్టిలో పెట్టుకుని నవరత్నాలకే ప్రాధాన్యం కల్పించారు.

- ప్రొఫెసర్ నారాయణరెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ, జేఎన్‌టీయూ

కాలువలో యువకుడి గల్లంతు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 7: తగరకుంట గ్రామానికి చెందిన రమేష్ కనగానపల్లి మండలంలోని తగరకుంట సమీపంలోని హంద్రీనీవా కాలువలో పడి గల్లంతయ్యాడు. బుధవారం సాయంత్రం వారి బంధువుల పిల్లలతో కలిసి హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లాడు. కాలువ గట్టున నిలబడి ఉన్న ప్రవీణ్ అనే పిల్లవాడు కాలుజారి కాలువలోకి పడ్డాడు. రమేష్ వెంటనే కాలువలోకి దూకి ఆ పిల్లవాన్ని గట్టున చేర్చాడు. అనంతరం రమేష్ నీటి ప్రవాహ వేగానికి కాలువలో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న కనగానపల్లి పోలీసులు, ఫైర్ సిబ్బంది నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 8 గంటలైనా అతని ఆచూకీ లభించలేదు.

మార్కెట్ వేలం రూ.87.90 లక్షలు

అనంతపురం క్రైం : అనంతపురం నగర పాలికకు 2024-25 సంవత్సరానికి సంబంధించి నిర్వహిం చిన మార్కెట్ వేలం రూ.87.90 లక్షలు పలికింది. గత ఏడాది దక్కించుకున్న వ్యాపారి విజయ్‌కుమార్ ఈ సారీ వేలం దక్కించుకున్నారు. గత ఏడాది రూ.76.60 లక్షలకు పలికిన మార్కెట్ వేలం ఈ సారి రూ.11 లక్షలకు పైగా పెరిగింది. గతనెల 31న నిర్వహించిన మార్కెట్ వేలం వాయిదా పడటంతో బుధవారం నగర అడిషనల్ కమిషనర్ హరిబాబు ఆధ్వర్యంలో మార్కెట్ వేలం నిర్వహించారు. అనంతపురానికి చెందిన విజయ్‌కుమార్, పుట్టపర్తికి చెందిన నారాయణస్వామి వేలంలో పాల్గొన్నారు. సర్కారు వారి పాట రూ.79లక్షలతో ఆరంభించారు. చివరికి 87.90 లక్షలకు పాడి విజయ్‌కుమార్ వేలం దక్కించుకున్నారు.

రామగిరి సీఐ బాధ్యతల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 7: రామగిరి సీఐగా శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడి వచ్చారు.

కేన్సర్‌పై అవగాహన పెరగాలి: వీసీ



మాట్లాడుతున్న వీసీ హుస్సేన్ రెడ్డి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 7: కేన్సర్ వ్యాధిపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎస్కేయూ పాలిమర్ సైన్స్ సెమినార్ హాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆ వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 40 కోట్ల మంది చనిపోతున్నారని, అంతేకాకుండా వారి కుటుంబాలపై చికిత్స రూపం ఆర్థిక భారం పడిందని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్స్ క్రిష్ణకుమారి, రామచంద్ర, సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మురళీధరరావు, కన్వీనర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

వివాహానికి సరుకుల వితరణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7: తాటిచెర్ల గ్రామానికి చెందిన సుమ్మది నిరుపేద. తన కుమార్తె వివాహం కోసం నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టును ఆమె ఆశ్రయించింది. బుధవారం ఆదర్శనగర్‌లోని ఆ ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి ఆ కుటుంబానికి రూ.15 వేలు విలువైన నిత్యావసర సరుకులు, పెళ్లికుమార్తెకు చీర, గాజులు అందజేశారు. కార్య క్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య, సైదా మణి, అనూష, గంగోత్రి, వేణు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న సభ్యులు

67.80 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

గార్లదిన్నె, ఫిబ్రవరి 7: మండలంలోని కనుంపల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 67.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. కల్లూరుకు చెందిన ఓ వ్యక్తి వివిధ గ్రామాల్లో ప్రజల నుంచి తక్కువ రేటుకు రేషన్ బియ్యం కొని... బెంగళూరుకు తరలించేందుకు కనుంపల్లి అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో ఆ అధికారులు ఈ దాడులు చేశా రు. ఆ బియ్యాన్ని గార్లదిన్నె సీఎస్‌డీటీ హరిప్రియాకు అప్పగించినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ, కానిస్టేబుల్స్ మనోహర్‌రెడ్డి, చంద్ర తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

వితంతు పింఛన్ కోసం నిరీక్షణ

ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న హసీనా



శింగనమల, ఫిబ్రవరి 7: శింగనమల గ్రామానికి చెందిన టెక్కే హసీనా భాను ఐదేళ్లుగా వితంతు పింఛన్ కోసం అధికారుల చుట్టూతిరుగుతూనే ఉంది. ఆమె భర్త టెక్కే మాబు 2019 సెప్టెంబరులో మరణించాడు. రేషన్ కార్డులో ఉన్న మాబు అమ్మకు అప్పటికే పింఛన్ వస్తోంది. ఒకే కార్డులో ఇద్దరికి పింఛన్ ఇవ్వరాదనే నిబంధన ఉండటంతో హసీనా భానుకు పింఛన్ మంజూరు కాలేదు. మూడు సంవత్సరాలు పోరాడటంతో హసీనా పేరుతో కొత్త రేషన్ కార్డు మంజూరైంది. ఈ సెప్టెంబరు పాత కార్డు నెంబర్ హౌస్ మ్యాపింగ్ నుంచి మాబు అమ్మను తొలగించి.. కొత్త రేషన్ కార్డు మంజూరు చేశారు. ఇక తనకు పింఛన్ మంజూరు చేయాలని హసీనాబాను మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. డిసెంబరులో నూతన పింఛన్‌దారుల జాబితాలో ఆమె పేరు లేదు. హసీనా పేరు మీద ఉన్న ఐడీ నెంబరు హోల్డ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎలాగైనా తనకు పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని హసీనా అధికారులను వేడుకుంటోంది.

పింఛన్ వచ్చేలా చూస్తాం : నాగేంద్ర, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్

హసీనా పింఛన్ దరఖాస్తును సీసీఎల్‌కు పంపాం... డిసెంబరులోనే పింఛన్ రావాల్సింది. అయితే హసీనా పేరుపై ఉన్న ఐడీనెంబర్ హోల్డ్‌లో పడింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సచివాలయం నుంచి అన్ని సక్రమంగానే పంపాం. రెండు నెలల్లో ఆమెకు పింఛన్ తప్పకుండా వస్తుంది.

రాప్తాడు ఎంపీడీఓగా గీతావాణి

రాప్తాడు ఫిబ్రవరి7: రాప్తాడు ఎంపీడీఓగా గీతావాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లా ఆదోని నుంచి ఆమె బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడి ఎంపీడీఓ సాల్మన్‌రాజు కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

ఘనంగా ఊరుదేవర



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 7: మండలంలోని నాగలాపురం గ్రామంలో దేవమ్మదేవి ఊరుదేవర ఘనంగా నిర్వహించారు. మూడురోజుల పాటు గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, గంగపూజ చేపట్టారు. రెండవరోజు మంగళవారం హోమా లు నిర్వహించారు. ఆఖరిరోజు బుధవారం ప్రత్యేకంగా అమ్మవారికి కుంభాభిషేకం, బలిదానం నిర్వహించారు. దేవరకు హాజరైన మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు టీడీపీ నాయకులు గోవిందు, నారాయణస్వామి, సంగప్ప, వెంకటేష్ తదితరులను ఘనంగా సత్కరించారు. హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు గంగాధర, మొండి మల్లికార్జున పాల్గొన్నారు.

సైకో సీఎంను సాగనంపుదాం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్



పామిడి, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలతో పాలన సాగిస్తున్న సైకో సీఎం జగన్‌ను సాగనంపి.. సంక్షేమ సారథి చంద్రబాబునాయుడును అధికారంలోకి తీసుకువచ్చి స్వాగతించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ శుభకార్యానికి హాజరైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా అప్పులమయమైందన్నారు. పరిమితికి మించి అధిక వడ్డీలకు రూ.వేల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. ఎప్పుడెప్పుడు సార్వత్రిక ఎన్నికలు వస్తాయా.. అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అపద్ధపు హామీలతో గద్దెనెక్కిన వైఎస్ జగన్ కక్ష రాజకీయాలకు తెరలేపారన్నారు. దీంతో ప్రజాస్వామ్యం అపహాస్యమైందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, హుసేన్‌పీరా, రామాంజనేయులు, రాము, షేక్షావలి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ శిలాఫలకాలే సాక్ష్యం



మాట్లాడుతున్న బండారు ఆనంద్

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 7: గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ వేసిన శిలాఫలకాలే సాక్ష్యమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ అన్నారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధిలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన, బీజేపీ, ఆమ్‌ఆద్మీ, భారత రాజ్యాంగ వేదిక, హ్యూమన్ రైట్స్ నాయకులు హాజరయ్యారు. ఆనంద్ మాట్లాడుతూ గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాల నుంచి ఐదుసార్లుగా టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతోగాను కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దౌల్తాపురం ప్రభాకర్, సీపీఐ వీరభద్రస్వామి, వైసీపీ దేవేంద్రప్ప, బీజేపీ గుర్రం సూర్యనారాయణ, జనసేన బండిశేఖర్, సీపీఎం చొక్కా సునీల్, ఆమ్‌ఆద్మీ మహమ్మద్‌గౌస్, హ్యూమన్‌రైట్స్ ఆలం నవాజ్, విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, రాజ్యాంగ వేదిక జింకల సరస్వతి, కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు చెబితే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తారా?

● ట్రాన్స్‌కో ఏఈని నిలదీసిన టీడీపీ నాయకులు



ట్రాన్స్‌కో ఏఈతో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, ఫిబ్రవరి 7: వైసీపీ నాయకుడు చెబితే కరెంట్ కనెక్షన్ కట్ చేస్తారా?, రైతుల కడుపు కొట్టకండి అంటూ ట్రాన్స్‌కో ఏఈ రాజారావును టీడీపీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెం దిన టీడీపీ మద్దతుదారుడు కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవల కొత్త బోరుబావి వేసుకున్నాడు. నీళ్లు పుష్కలంగా పడడంతో పాతబోరు బావికి ఉన్న కరెంట్ కనెక్షన్‌ను కొత్తదానికి అమర్చుకున్నాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ట్రాన్స్‌కో ఏఈకి ఫోన్‌చేసి కనెక్షన్ తొలగించాలని చెప్పడంతోనే తొలగించారని రైతు ఆరోపించాడు. దీనిపై టీడీపీ నాయకులతో కలిసి బుధవారం ట్రాన్స్‌కో కార్యాలయానికి వచ్చి ఏఈని నిలదీశారు. వైసీపీ నాయకులు చెప్పుడు మాటలు విని రైతులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, చలమారెడ్డి, శేఖర్, రామకృష్ణ, రామానాయుడు ఉన్నారు.

ఆవులను తరలిస్తున్న వారిని శిక్షించాలి



కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 7: కంటైనర్ బోల్తా పడిన సంఘటనలో మూగజీవాలు మృత్యువాతపడడంతో బీజేపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి అ తి కిరాతకంగా మూగజీవాలను అనంతపురం జిల్లా మీదుగా అక్రమంగా ర వాణా కొనసాగుతోందన్నారు. ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. నాయకులు రాధాకృష్ణ, ధనుంజయగౌడ్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: అక్రమంగా ఆవులను తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌కు బుధవారం బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గుత్తిమండలం కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద వేకువజామున కంటైనర్ బోల్తా పడి 40 ఆవులు, ఇద్దరు వ్యక్తులు మరణించారన్నారు. ప్రతి రోజు అక్రమంగా పశువులను రవాణా చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, బండారు కృష్ణమూర్తి, వడ్డేరమేష్, గుర్రం సూర్యనారాయణ, మహేష్, ప్రభాకర్, రవి, బండిమురళి, వెంకటేశ్వర్లు, కేవీ వెంకటరమణ, వెంకటరాఘవ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 7: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ సూచించారు. బుధవారం ఆమె స్థానిక ఆర్డీటీ, సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపీ, లేబర్, వార్డు రక్తపరీక్షల కేంద్రం తదితర వాటిని ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు ఎల్లప్పుడూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

బాలల హక్కులపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని రైల్వే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల పరిరక్షణ అధికారి వెంకటేశ్వరి మాట్లాడుతూ పిల్లలకు ఆపద కలిగితే, వారి హక్కులు హరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే 1098చైల్డ్‌హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం డ్రాయింగ్, పెయింటింగ్, చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, ఏఎస్ఐ పద్మావతి, సోషల్‌వర్కర్ వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు సుధాకర్, కుమార్, మున్నా, లావణ్య, షాహిదా పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, ఫిబ్రవరి 7: ఒక్కచాన్స్ ఇవ్వండని అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. వజ్రకరూరు మండలంలోని జరుట్ల రాంపురం, జె.కొట్టాల, వెంకటాంపల్లి చిన్నతండాలో బుధవారం ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు మునుపు జరుట్ల రాంపురంలో జరుట్ల రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. అధికారంలోని వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, తట్రగల్లు సుధాకర్, నాగభూషణం, దస్తగిరి, నాగేంద్ర, మండి ఎర్రిస్వామి, మాజీ సర్పంచు ఎర్రిస్వామి, నరసప్ప పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

టీడీపీ విజయమే ధ్యేయం

కళ్యాణదుర్గం: టీడీపీ విజయమే మనందరి ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. బుధవారం మండలంలోని మరిమాకులపల్లిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఆర్‌జీ శివశంకర్, గోళ్ల వెంకటేశులు, ఉన్నం వరలక్ష్మి, గాజుల శ్రీరాములు, వెంకటేశులు, తిప్పేస్వామి, వీరణ్ణ పాల్గొన్నారు.

గుత్తిరూరల్: మండలంలోని మముదూరు గ్రామంలో బుధవారం టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్యారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. నారాయణ, ఎల్లప్పరమేష్, నాగరాజు, అంజనేయులు, కదిరెప్ప, గోవిందురాజులు, మనోహర్ పాల్గొన్నారు.

మీ తొలి ఓటు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది

● టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 7: మీ తొలి ఓటు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం జితేంద్రగౌడ్ చేతుల మీ దుగా మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో చంద్రబాబు ముందుచూపుతో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలను తీసుకొచ్చాడన్నారు. సైకో జగన్ పాలనలో ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లిపోయేలా చేశాడని విమర్శించారు. యువత మీ తొలి ఓటును కులం, మతం చూడకుండా విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుకు వేయాలన్నారు. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్, నాయకులు రాయల్‌రామయ్య, హనమంతు, పాలమల్లికార్జున, జింకల జగన్నాథ్, రాయల్ వెంకటేష్, కురుబ సురేష్, బండి లక్ష్మీదేవి, మహమ్మద్ ఆలీ, నెట్టికంటయ్య, మహాదేవ్, నాగరాజు, సురేంద్ర పాల్గొన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి



మాట్లాడుతున్న పెరుమాళ్ల జీవానంద రెడ్డి

గుత్తి: నిరుద్యోగాన్ని పెంచుతున్న వైసీపీ ప్రభుత్వానికి యువత ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెరుమాళ్ల జీవానంద రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో మై ఫస్ట్ ఓట్ సీబీఎన్ అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయక అనేక మంది యువతీ యువకులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకుడు రాయల్‌రమణ, తెలుగు యువత నాయకులు సుధాకర్‌నాయుడు, వేణుగోపాల్, టీడీపీ నాయకులు పాలాక్షిరెడ్డి, సూరి, జైపాల్‌రెడ్డి, రామలింగారెడ్డి, హనమంతరెడ్డి, చిరంజీవి, మారుతి, హరీష్, గణేష్, గురున్నాథ్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ



రైతును పరామర్శిస్తున్న బండారు శ్రావణి

పుట్లూరు, ఫిబ్రవరి7: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త రామాంజనేయులును బుధవా రం నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి పరామర్శించారు. ఆ యన ఆరోగ్యంపై ఆరాతీశారు. అనంతరం టీడీపీ నాయకులు బ్రహ్మయ్య ఉల్లిగడ్డ తోటను పరిశీలించారు. ధర బాగున్న సమయంలో పంటను కాల్చడం పిరికిపంద చర్య అన్నారు. ఆమె వెంట జీసీ బాబు, గోవర్దన్‌రాజు ఉన్నారు. బ్రహ్మయ్య ఉల్లిగడ్డల తోటను పరిశీలించి టీడీపీ నాయకు లు పరామర్శించారు. సుదర్శన్‌నాయుడు, విజయ్, శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని భాగ్యనగర్ సంత్‌సేవాలాల్ ఆలయం వద్ద బుధవారం అఖిల భారత బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 13 నుంచి 15వ తేదీ వరకు గుత్తిమండలంలోని సేవాఘడ్‌లో సేవాలాల్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. ఈ ఉత్సవాలకు భారత దేశంలోని బంజారాలందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. రైల్వే సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, ఏడీఈఎన్ రామస్వామినాయక్, సేవాలాల్ ట్రస్ట్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ భూక్యా వెంకటరమణ నాయక్, సభ్యులు రూపానాయక్, తిరుపాల్‌నాయక్, సోమలానాయక్, నారాయణనాయక్, రామునాయక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 7: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన సుందర్ అనే వ్యక్తి మృతి చెందడంతో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిప్పేస్వామి, కృష్ణ, నాయకులు ఎర్రిస్వామి, రవిచంద్రసాగర్, అనిల్, పురందర పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

కుందుర్పి, ఫిబ్రవరి 7: మండలంలోని అపిలేపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం దళితులకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 200 కుటుంబాలు ఎస్సీ కాలనీలో నివసిస్తున్నామని, శ్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రామాంజనేయులు, మూర్తి, మారుతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకుంటాం: జేసీపీఆర్

తాడిపత్రి, ఫిబ్రవరి 7: యల్లనూరు మండలంలో జరిగే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని బుధవారం టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిత్రావతినది నుంచి ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో జరుగుతున్న ఇసుక అక్రమ తరలింపును గురువారం నుంచి అడ్డుకుంటామన్నారు. ప్రతిమ పేరుతో ఇస్తున్న బిల్లులకు అనుమతి లేదన్నారు. అక్రమంగా ఇస్తున్న బిల్లులతో రవాణా జరుగుతోందన్నారు. పర్యావరణ అనుమతులు కూడా లేవన్నారు. గతంలో జేపీ పవర్ వెంచర్స్ లిమిటెడ్‌కు ఉన్న అనుమతుల గడువు ముగిసిందన్నారు. కొత్తగా ప్రతిమ కంపెనీ చేసిన దరఖాస్తులకు అనుమతులు రాలేదన్నారు. అయినప్పటికి పోలీసు, మైనింగ్, రెవెన్యూశాఖ అధికారులు సిబ్బంది అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని రవాణా చేస్తున్న వాహనాలకు అనుమతి లేకపోతే సంబంధిత అధికారులపై ఫిర్యాదులు చేస్తామనిహెచ్చరించారు.

రాయదుర్గం ఎస్ఐగా వెంకటరమణ

రాయదుర్గం, ఫిబ్రవరి 7: రాయదుర్గం అర్బన్ ఎస్ఐగా జీడీ వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న ప్రసాద్‌బాబు సాధారణ ఎన్నికలలో భాగంగా తిరుపతికి బదిలీ చేయడంతో చిత్తూరు టౌన్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జీడీ వెంకటరమణ బదిలీపై రాయదుర్గం ఎస్ఐగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు.

రూరల్ ఎస్ఐగా సాగర్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ ఎస్ఐగా సాగర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నెలో పనిచేస్తున్న సాగర్ బదిలీపై వచ్చారు. ఈ స్థానంలో ఎస్ఐగా పనిచేస్తున్న గౌస్ మహమ్మద్ గార్లదిన్నెకు బదిలీ అయ్యారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

గుత్తి, ఫిబ్రవరి 7: విద్యార్థులు రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని గేట్స్ కళాశాల డైరెక్టర్ శ్రీవా ణి కోరారు. పట్టణ శి వారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం కొర త ఏర్పడినందున అధికారుల అభ్యర్థన మేరకు కళాశాల యాజమా న్యం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సుభాష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు.

పెరిగిన చింతపండు ధర

రాయదుర్గం, ఫిబ్రవరి 7: పట్టణంలోని మార్కెట్‌లో నిర్వహించిన వేలంలో గతవారం కంటే ఈ వారం చింతపండు ధర పెరిగినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం పేర్కొన్నారు. మార్కెట్‌లో చింతపండు అమ్మకానికి 91 మంది రైతులు 223.5 క్వింటాళ్లు తీసుకొచ్చినట్లు తెలిపారు. చపాతి రకం రూ. 4200 నుండి రూ. 9500 వరకు ధర పలికిందన్నారు. అదే విధంగా కర్పూలీ రకం రూ. 11,100 నుండి 20,200 ధర పలికినట్లు తెలిపారు.

ధర్మవరం గేటు సమస్యపై రైల్వే జీఎంకు ఫిర్యాదు



జీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు జగదీశ్, గోవిందు

గుంతకల్లు, ఫిబ్రవరి7: స్థానిక ధర్మవరం గేటు వద్ద నిర్మించనున్న ఆర్‌యూబీ వల్ల పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని, దాన్ని అడ్డుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు ఫిర్యాదుచేశారు. బుధవారం ఉదయం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయానికి వెళ్లిన జగదీశ్, సీపీఐ నాయకులు జీఎంతో భేటీ అయ్యారు. జగదీశ్ మాట్లాడుతూ గుంతకల్లులో ఉన్న 157వ నెంబర్ ఎల్సీ అయిన ధర్మవరం గేటును తొలగించడానికి ఆర్‌యూబీని నిర్మించేందుకు రైల్వేశాఖ అనుమతులిచ్చిందన్నారు. కానీ ఆర్‌యూబీని తొలుత నేరుగా నిర్మించడానికి స్కెచ్‌ను సిద్ధంచేసిన గుంతకల్లు రైల్వే అధికారులు, ఆ తర్వాత స్థానిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీ ఆకృతిలో నిర్మించడానికి ప్లాన్‌ను మార్చారన్నారు. కేవలం 3.6 మీటర్ల ఎత్తు ఉండేలా నిర్మించనున్నారని, అంత తక్కువ ఎత్తు ఉండేలా ఆర్‌యూబీని నిర్మిస్తే భారీ వాహనాలు వెళ్లవన్నారు. దీనివల్ల పట్టణాభివృద్ధి నిలిచిపోతుందని, స్థానికులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. కనుక కల్పించుకుని ఆర్‌యూబీ ఎత్తును పెంచాలని, నేరుగా నిర్మించాలని కోరుతూ జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకుడు బీ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన ఇసుక రవాణా

● రీచ్ నుంచి యంత్రాలను బయటకు పంపిన పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యల్లనూరు, ఫిబ్రవరి 7: మండలంలోని చిత్రావతి నది నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను పోలీసులు బుధవారం రాత్రి ఆపివేశారు. ఆంధ్రజ్యోతిలో చిత్రావతి ఇసుకకు రెక్కలు అనే కథనం ప్రచురణ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బుధవారం మధ్యాహ్నం వాహనాలను పోలీసులు వెళ్లి ఆపినప్పటికీ, తిరిగి సాయంత్రం నుంచి కొనసాగించడంతో రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఇసుకరీచ్ వద్దకు వెళ్లి నదిలో ఉన్న ఎక్స్‌కవేటర్లను బయటకు పంపివేశారు. ప్రభుత్వం నుంచి ఇసుకను తరలించడానికి అనుమతి పత్రం చూపించినప్పటికి, చిత్రావతి నదిలో ఇసుకను తవ్వడానికి ఈసీ అనుమతులు లేవని దీంతో వాటిని ఆపివేసినట్లు సీఐ తెలిపారు. ఇసుక రవాణాను పోలీసులు ఆపుతున్నారని సమాచారం రావడంతో విలేకరులు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడున్న వాహన డ్రైవర్ నుంచి నిర్ణయించిన ధర కంటే అధికంగా రూ.1500 వసూలు చేస్తుండడంతో అదనపు మొత్తం ఎందుకని విలేకరులు ప్రశ్నించారు. దీంతో అక్కడున్న సిబ్బంది మీరెవరు అడగడానికి, మీరు ఎందుకు ఇక్కడకు వచ్చారంటూ పోలీసుల ఎదుట చిందులు వేశారు. అనుమతి పత్రాలు చూపించాలంటూ అడిగినా ఇక్కడ లేవు ఆఫీసులో అడగండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇసుక రీచ్ నుంచి వెళుతున్న ఎక్స్‌కవేటర్లు

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక



పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

కూడేరు, ఫిబ్రవరి 7: మండలం పి.నారాయణపురం గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం గ్రా మానికి చెందిన తాడిగోట్ల శివారెడ్డి, తిమ్మారెడ్డి, మోహన్‌రెడ్డి పార్టీలోకి చేరడంతో పయ్యావుల శ్రీనివాసులు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆ హ్వానించారు. ఎంపీపీ స్వగ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు మొదలయ్యాయి. నాయకులు నారాయణస్వామి, ముత్యాలరెడ్డి, రమేష్‌రెడ్డి, శీనా పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలసలు

రాయదుర్గం, ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నియంత పాలనతో విసిగిపోయిన అనేకమంది వైసీపీ నాయకులు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఉదయం ఆయన పట్టణంలోని 9వ వార్డులో పద్మశాలి వర్గానికి చెందిన ముఖ్యులను కలిశారు. వార్డులో వైసీపీ రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు శివప్ప సోదరుడు అరవా శ్రీనివాసులుతో పాటు 40 కుటుంబాల వారికి పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 9వ వార్డులో టీడీపీ అత్యధిక మెజార్టీ సాధిస్తుందన్నారు. ఒక్కచాన్స్ పేరుతో గద్దెనెక్కిన జగన్ నిత్యావసర సరుకుల ధరలను అమాంతం పెంచి, పేదల బతుకుల్ని ఛిద్రం చేశాడని విమర్శించారు. జిల్లా అధికార ప్రతినిధి పొరాళ్ల పురుషోత్తం, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, కేపీదొడ్డి నాగరాజు, బేకరి తిప్పేస్వామి, వెంకటేశులు, ఏటూరి కుమార్, అన్నే బసవరాజు, ఖలందర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 7: మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న పదిమందిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు బొమ్మనహాళ్, ఉంతకల్లు గ్రామాలకు చెందిన పది మందిని గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా తన సిబ్బందితో దాడు లు నిర్వహించి రూ.24,300, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది రుద్ర, రాజకుళ్లాయప్ప, జగదీష్ ఉన్నారు.

నగలు, నగదు చోరీ

యల్లనూరు, ఫిబ్రవరి 7: మండలకేంద్రంలోని పిన్నదరి నాగరంగయ్య ఇంట్లో రూ.7లక్షలు నగదుతోపాటు ఐదు తులాల బంగారు నగలు చోరీగురైనట్లు గురైనట్లు బాధితుడు తెలిపారు. ఉదయం వరి పొలానికి నాట్లు వేయడానికి కూలీలతో కలిసి వెళ్లగా, భార్య ఇంటికి బీగం వేసి పశువులు కాసేందు కు వెళ్లిందన్నారు. సాయంత్రం 3గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బీగం పగిలి ఉందని, బీరువాలో ఉన్న నగదు, బంగారు నగలు చోరీకి గురయ్యాయని తెలిపాడు. యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఒకరి మృతి

ఉరవకొండ, ఫిబ్రవరి 7: పట్టణ శివారులోని రాములమ్మ గుడి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామన్న (38) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆమిద్యాలకు చెందిన రామన్న ఉరవకొండ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా, అనంతపురం వైపు నుంచి వస్తున్న, మరో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రామన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మరో స్కూటర్లలో ఉన్న కోనాపురానికి చెందిన వంశీకి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విషాహారం తిని గొర్రెలు...

ఉరవకొండ, ఫిబ్రవరి 7: మండలంలోని కౌకుంట్ల, తగ్గుపర్తికి వెళ్లే దారిలో విషాహారం తిన్న 50 గొర్రెలు మృతి చెందాయి. రాకెట్ల తండాకు చెందిన వెంకటేశ్ నాయక్ గొర్రెలను మేత కోసం తీసుకెళ్లారు. తిరిగి ఊరికి తెస్తున్న సమయంలో ఉన్న ఫలంగా కూలిపోయి మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. రూ.4లక్షలు దాకా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలన్నాడు.

కేబుల్ వైరు చోరీ

కూడేరు, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని ఉదిరిపికొండ గ్రామంలో పాల లక్ష్మీదేవికి చెందిన తోటలో వ్యవసాయ మోటర్ కేబుల్, స్టార్టర్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలియజేశారు.

టీడీపీ కౌన్సిలర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తాడిపత్రి, ఫిబ్రవరి 7: పట్టణంలోని 36వవార్డు టీడీపీ కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వార్డులో వైసీపీకి మద్దతుగా వలంటీర్ అనిల్ ఓటరులిస్టు వెరిఫికేషన్ చేస్తున్నాడంటూ లక్ష్మీదేవి అడ్డుకుంది. తనను అసభ్యంగా మాట్లాడడమే కాకుండా కులం పేరుతో దూషించాడన్న వలంటీర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

పుట్లూరు, ఫిబ్రవరి 7: మండలంలోని కుమ్మనమల గ్రామ సమీపంలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేశవనాయుడును అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి 11మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడిచేసి నిందితున్ని అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

గొర్రెల అపహరణ

బెళుగుప్ప, ఫిబ్రవరి 7: మండలంలోని గంగవరం వద్ద మంగళవారం రాత్రి 22 గొర్రెలను అపహరించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురానికి చెందిన ఆదినారాయణ గొర్రెలను మేతమేపడానికి తీసుకువచ్చి పొలాల్లో మందను వేసుకుని వుండగా గుర్తుతెలియని వ్యక్తి గొర్రెలను ఎత్తుకెళ్లాడని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు.

ఎలుగుబంటి సంచారం



ఎలుగుబంటి దాడిలో దెబ్బతిన్న పరికరాలు

కూడేరు, ఫిబ్రవరి 7: మండలంలోని గొట్కూరు గ్రామ సమీప పొలాల్లో ఎలుగుబంటి సంచరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో తోటల్లోకి వెళ్లి వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేస్తోందని రైతులు వాపోతున్నారు. గ్రామ సమీపంలోని గుట్టవద్ద ఎలుగుబంటి కనిపించిందని రైతులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని అడవులోకి తరిమివేయాలని కోరుతున్నారు.

దేవదాయ భూముల పరిశీలన



దేవదాయశాఖకు చెందిన స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉరవకొండ, ఫిబ్రవరి 7: పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల సమీపంలో కబ్జాకు గురైన దేవదాయ భూములను ఆ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. దేవాలయ భూములు అమ్ముకున్నారనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, గ్రూప్ టెం పుల్ అధికారి కృష్ణయ్య భూములను పరిశీలించారు. కబ్జాకు సంబంధించిన వివరాలను సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు కూడా సంబంధించిన సర్వే నెంబర్ 563లో వివరాలను సేకరించారు.

అధికారుల్లో స్పందన లేదు: సీపీఐ

మేజరు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ, దేవాలయ స్థలాలను కొంతమంది దర్జాగా కబ్జా చేసినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున ప్రశ్నించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూములు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నా, అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సుల్తాన్ మల్లికార్జున పాల్గొన్నారు.